క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం

వేంపల్లె : స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మ తెలిపారు. తొలి ఏకాదశి సందర్భంగా గురువారం ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ సిద్ధాంతి నేతృత్వంలో తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సురేంద్ర, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉరుసు ఉత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని కొండూరు గ్రామంలో వెలసిన మస్తాన్‌స్వామి ఉరుసు ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. మధ్యాహ్నం స్వామివారికి గంధం కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి గుండం ఏర్పాటు చేయడం, స్వామివారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. శుక్రవారం గుండం ప్రవేశం, గ్రామోత్సవం ఉంటుందన్నారు.

సబ్సిడీ ధరలతో కందిపప్పు పంపిణీ



కందిపప్పును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ఎర్రగుంట్ల : పేదలకు అతి తక్కువ ధరలకే రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ధరలతో కందిపప్పు, బియ్యంను అందిస్తోందని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని టీఎంఆర్ మాల్‌లో ఆయన సబ్సిడీ ధరలపై బియ్యం, కందిపప్పును పంపిణీ చేసి మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, తహసీల్దార్ సాజన్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన టమోట ధరలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న టమోటాలు

పులివెందుల రూరల్ : కూరగాయల మార్కెట్‌లో టమోట ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. టమోట ధరలు రూ.60 నుంచి రూ.80 పలుకుతున్నాయి. సామాన్యులు కొనలేని పరిస్థితి ఏర్పడింది. టమోట పంట సాగు తగ్గడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కాయల నాణ్యతను బట్టి మార్కెట్‌లో ధరలు చెబుతున్నారన్నారు. ప్రభుత్వం కూరగాయల ధరలు తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

జమ్మలమడుగు రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, దాల్మియా భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు అంబవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా శిక్షణను ఇవ్వనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హెల్త్‌కేర్, కంప్యూటర్, ఎలక్ట్రికల్‌పై 3 నెలల పాటు శిక్షణ ఇచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. విద్యార్థులు కనీసం 10వ తరగతి లేదా ఐటీఐ డిప్లొమా, లేదా డిగ్రీ ఉండాలని ఆయన సూచించారు. వయస్సు 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి శిక్షణ కోసం వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. వివరాలకు 9100248393, 8985862182 సంప్రదించాలని ఆయన సూచించారు.

కాశినాయన ఆలయ అభివృద్ధికి చర్యలు

కాశినాయన : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన జ్యోతిలోని కాశిరెడ్డి నాయన ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నాయకులు రితీష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జ్యోతి క్షేత్రంలో కాశినాయన ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1995లో కాశినాయన సమాధి అయ్యారని, అప్పటి నుంచి కాశినాయన భక్తులు ఆలయ నిర్మాణాలు చేపడుతూ వచ్చారని తెలిపారు. ఎనిమిది దశాబ్దాల చరిత్ర ఉన్న క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తున్న తరుణంలో పదేళ్ల కిందట అటవీ అధికారులు అనుమతి లేదంటూ పనులు నిలిపివేశారని చెప్పారు. ఆలయ అభివృద్ధికి 12.98 హెక్టార్ల భూమి అవసరముందన్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ఎంత భూమి అవసరమో అంతకు రెండింతలు భూమిని అటవీ అధికారులు అడగగా ఆశ్రమ నిర్వాహకులు ఒప్పుకున్నారని చెప్పారు. వారం రోజుల కిందట అటవీ అధికారులు ఆశ్రమం వద్దకు వచ్చి కొన్ని భవనాలు తొలగించేందుకు మార్కింగ్ ఇచ్చారని తెలిపారు. అటవీ శాఖ అనుమతిలేకపోవడంతో పనులు నిలిచిపోయాయని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కేంద్ర అటవీ శాఖ అధికారులకు వివరించి అనుమతులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

ఇంట్లోనే విద్యుత్ ఉత్పత్తి

- పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం
- సబ్సిడీతో పాటు రుణసదుపాయం కల్పిస్తున్న కేంద్రం
- నెట్ మీటర్‌తో విద్యుత్ ఉత్పత్తి
- వాడకం తెలుసుకునే అవకాశం
- కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్‌తో నెలకు 125 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి



ఎర్రగుంట్ల : మన ఇంట్లోనే సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా కేంద్రం ప్రభుత్వం పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకంలో చేరాలంటే ముందుగా సూర్యఘర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేయాలి. ఆరు నెలల కరెంటు బిల్లు కాపీని జతపరచాలి. తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యుత్‌వాడకం 300 యూనిట్‌లోపు మాత్రం ఉండాలన్న నిబంధన ఉంది. తదుపరి ట్రాన్స్‌కో అనుమతులు పొందాక వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఇందులో కిలో వాట్‌కు నిర్ణయించిన దాని ప్రకారం సబ్సిడీ ఇస్తారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పించనున్నారు. చివరగా ఇంటి రూఫ్‌పై వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వాడే మీటర్ స్థానంలో నెట్ మీటర్ ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా సోలార్ ఉత్పత్తి.. వినియోగదారు వాడుతున్న విద్యుత్‌ను లెక్కిస్తారు.

30 రోజుల్లో సబ్సిడీ..

నెట్ మీటర్ అమర్చిన తరువాత వినియోగదారులు పోర్టల్‌లో బ్యాంక్ ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాలి. సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లో చెల్లిస్తుంది. ఒక కిల్ వాట్ రూఫ్ టాప్ కెపాసిటీ కోసం 3-4 ప్యానల్స్ (1 మీటర్ వెడల్పు, 1.6 మీటర్ల ఎత్తు) అమర్చనున్నారు. ఒక కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ నెలకు దాదాపు 125 పై యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. సోలార్ రూఫ్ టాప్ ప్యానళ్ల సూర్యుని వేడిని పీల్చు కోవడం వల్ల ఇల్లు చల్లగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. వినియోగదారులు పెట్టిన పెట్టుబడి ఆరు నుంచి ఏడేళ్లలో తిరిగి పొందగలరని సోలార్ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

పీఎం సూర్యఘర్ పథకం వివరాలిలా..

వినియోగం (యూనిట్లలో)	సోలార్ కెపాసిటీ (కిలోవాట్లలో)	సబ్సిడీ
0-150	1-2	రూ.30,000 నుంచి రూ.60,000
150-300	2-3	రూ.60,000 నుంచి రూ.78,000
300లోపు	3	రూ.78,000

ఇది మంచి పథకం



వినియోగదారులే సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసుకునే సూర్యఘర్ మంచి పథకం. సోలార్ విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ. రుణ సదుపాయం కల్పిస్తోంది. 6-7 ఏళ్లలో పెట్టిన పెట్టుబడి తిరిగి పొందవచ్చు. నెట్ మీటర్ విధానం ద్వారా విద్యుత్ ఉత్పత్తి వాడకం తెలుసుకోవచ్చు. సందేహాలుంటే ట్రాన్స్‌కో అధికారులతో నివృత్తి చేసుకునే అవకాశ ఉంది. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– కిరణ్‌కుమార్ (ఏడీఈ ట్రాన్స్‌కో ఎర్రగుంట్ల)

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారిని సాయిగ్రేస్

పెండ్లిమర్రి : యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని ఇసుకపల్లె, ఎగువపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ కౌన్సిలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారిని సి.సాయిగ్రేస్ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్క విద్యార్థి పరిశుభ్రత పాటించాలన్నారు. మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెవాలన్నారు. కార్యక్రమంలో రిటైడ్ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గుణశేఖర్, పాఠశాల హెచ్‌ఎంలు శివమోహన్, అపర్ణ, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహిరంగ మల, మూత్ర రహిత గ్రామాలే ధ్యేయం



గోటూరులో సర్వే చేస్తున్న అధికారులు

వల్లూరు : గ్రామాలను పూర్తిగా బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రధాన ధ్యేయమని కమలాపురం, వల్లూరు ఎంపీడీవోలు జ్యోతి, విజయ భాస్కర్‌లు తెలిపారు. మండల పరిధిలోని గోటూరు గ్రామంలో గురువారం ఓడీఎఫ్ ప్లస్ మోడల్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వారు గ్రామంలోని 50 గృహాలను పరిశీలించి సర్వే నిర్వహించారు. గృహాలకు వ్యక్తిగత మరుగుదొడ్లు వున్నాయా లేదా, వుంటే అవి సక్రమంగా ఉపయోగిస్తున్నారా అనే అంశాలను పరిశీలించారు. పొడి, తడి చెత్తలను గ్రీన్ అంబాసిడర్స్‌కు వేరు వేరుగా అందించడానికి ప్లాస్టిక్ టబ్‌లు వున్నాయా లేదా, వుంటే వాటిని ఉపయోగిస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించి గ్రీన్ అంబాసిడర్స్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కమలాపురం, వల్లూరు మండలాల ఈవో పీఆర్‌డీలు శారదమ్మ, ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సునీత, పంచాయతీ కార్యదర్శి కరీముల్లా, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నైతిక విలువల పాత్ర కీలకం



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న మానవత చైర్మన్ డి.వి.కొండారెడ్డి

తొండూరు : విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగడంలో నైతిక విలువల పాత్ర ఎంతో కీలకమని పులివెందుల మానవత చైర్మన్ డి.వి.కొండారెడ్డి తెలిపారు. తొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 'విద్యార్థులు నైతిక విలువలు' అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రధాన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్న వయసులోనే పిల్లల్లో శాంతి, సహనం, సహాయ గుణాలు అలవడేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన రాజకుల్లాయప్ప, సుమజ, మునిచేతన్‌లకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు జయరాజ్, కార్యదర్శి గంగిరెడ్డి, డైరెక్టర్ విశ్వనాథరెడ్డి, కన్వీనర్ బి.వి కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు జమ చేయాలి



సచివాలయం కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

చింతకొమ్మదిన్నె : ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు రైతుల ఖాతాలో జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి కోరారు. గురువారం కొలుములపల్లె గ్రామ సచివాలయం కార్యదర్శికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో కూటమి ఇచ్చిన హామీలలో రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు రైతుల ఖాతాలో జమచేస్తామన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో వర్షాభావంతో ఒకవైపు, డిసెంబర్‌లో వచ్చిన తుఫాన్‌తో మరోవైపు పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని ఈ ఖరీఫ్‌లో వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతాంగం తీవ్రంగా ఇబ్బందులు పడుతోందన్నారు. సున్న, పావలా వడ్డీ రాయితీలు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో వడ్డీ, అసలు కట్టాలని బ్యాంకులు ఒత్తిడి చేసి వసూలు చేస్తున్నాయన్నారు. వడ్డీ రాయితీ విడుదల చేసి రైతుల ఖాతాలో వెయ్యాలని, ఎన్నికల ముందు కూటమి ప్రకటించిన పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ.20 వేలు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం కడప జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేసిన అధ్యాపకులు శ్రీనివాసులు

వేంపల్లె : స్థానిక జడ్పీ బాలికల ప్లస్ 2 విద్యార్థులకు గురువారం స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేశారు. తెలుగు అధ్యాపకునిగా బోధన చేస్తున్న చెరుకూరు శ్రీనివాసులు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా క్లాసులకు హాజరు కావాలని, సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదవాలని కోరారు. అలాగే అధ్యాపకులు చెప్పిన పాఠాలు ఎప్పటికప్పుడు నేర్చుకుని శ్రద్ధ, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఉన్నత చదువులు చదివినప్పుడే భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోగలమని, అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేధించగలమన్నారు. త్వరలో ప్లస్ 2కు సంబంధించి పాఠ్య, నోటు పుస్తకాలు బ్యాగులు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పీజీటీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై టీడీపీ నేతల ఒత్తిడి

బి.కోడూరు : మండలంలో అధికార పార్టీ నాయకుల ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. రెవెన్యూ, ఏపీఎస్‌పీడీసీఎల్, పోలీస్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులకు ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయి. తాము చెప్పినట్లు చేయకపోతే మీ గురించి జిల్లా అధికారులకు తెలియజేసి సస్పెండ్ చేయిస్తామంటూ బెదిరిస్తున్నారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక తల పట్టుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అధికార పార్టీ నాయకుల ఆగడాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఒక పక్క పౌరసరఫరాల శాఖకు సంబంధించి రేషన్ డీలర్ల నియామకానికి ఎటువంటి జీవోలు, నిబంధనలు రానప్పటికీ ఉన్న డీలర్లను తొలగించి వెంటనే మా వారిని నియమించాలంటూ రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. గతంలో నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసిన ఏపీఎస్‌పీడీసీఎల్ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని ఆ శాఖ అధికారులపై, అలాగే గత 15 ఏళ్ల అనుభవంలో సాగులో ఉన్న రెవెన్యూ భూములను సైతం వదలడం లేదు. దీంతో రెవెన్యూ అధికారులు చేసేదేమీ లేక సెలవులపై వెళుతున్నారు. దీనిపై మండలంలోని రైతాంగం త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ గోడును విన్నవించుకోనున్నారు.

సంగతుల వెనుక శాస్త్రీయత తెలియాలి

కడప కల్చరల్ : రోజువారి జీవితంలో ఎన్నో సంగతులు తెలుసుకుంటామని, వాటి వెనుకగల శాస్త్రీయతను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని జన విజ్ఞాన వేదిక నగర అధ్యక్షులు శివరాం అన్నారు. గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ (మెయిన్) హైస్కూలులో సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథాన్ని గురించి అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. సభ్యులు ఇందులో శాస్త్రీయత, వాటిని గుర్తించే ప్రయోగాలు, సైన్స్ వెనుకగల అంశాలు తదితరాలను ఉదాహరణలతోసహా వివరించారు. ఈ సందర్భంగా ఒక్కొక్క సైన్స్ అంశాన్ని తీసుకుని శాస్త్రీయ కోణంలో దాన్ని విశ్లేషించారు. మ్యాజిక్‌షోలో వింత ఏమి ఉండదని, ప్రతి అంశానికి శాస్త్రీయమైన లాజిక్ తప్పక ఉంటుందని తెలుసుకోవాలన్నారు.

20న కార్మికులు తరలి రావాలి

కడప కోటిరెడ్డి సర్కిల్: తమ జీవన భృతి పెంపు విషయంగా ఉన్నతాధికారులకు తెలియజేసేందుకు ఈనెల 20వ తేదీన ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులందరూ కడపకు తరలి రావాలని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు.

దళితులకు నీటి, ఇంటి పన్నులు తగ్గించండి



పన్నులు తగ్గించాలని కోరుతున్న ఇందిరమ్మ కాలనీ మహిళలు

ఎర్రగుంట్ల : పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలోని దళితులకు అధికంగా ఇంటి, నీటి పన్నులు వస్తున్నాయని వాటిని తగ్గించాలని గురువారం కమిషనర్ రామకృష్ణయ్యకు కాలనీ మహిళలు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీకి సక్రమంగా నీరు సరఫరా కావడంలేదన్నారు. నీటి పన్ను, ఇంటి పన్నులు కలిపి ఒక్కోక్క ఇంటికి సుమారు రూ.3 వేలు వచ్చిందన్నారు. మున్సిపల్ అధికారులు వచ్చిన డిమాండ్ నోటీసులను కూడా ఇచ్చారన్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దళితులకు పన్నులు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీకి చెందిన మహిళలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించండి



కుష్టువ్యాధికి సంబంధించి పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్యులు కళ్యాణ్‌దినకర్, తదితరులు



పులివెందులలో కుష్టువ్యాధి పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యులు

లింగాల : కుష్టువ్యాధి నిర్మూళన కార్యక్రమంలో భాగంగా లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపైన్ కార్యక్రమాన్ని ఇంటింటా నిర్వహించాలని పీహెచ్‌సీ వైద్యులు కళ్యాణ్ దినకర్ తెలిపారు. లింగాల పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో నేటి నుంచి ఆగస్టు 2 వరకు 16 రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు తమకు కేటాయించిన గృహాలను సందర్శించి పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ అయిన వారికి మందులు సరఫరా చేయాలన్నారు. దిగువ లింగాలలో జరుగుతున్న కుష్టువ్యాధి కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీపీఓ రమణారెడ్డి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : జాతీయ కుష్టునివారణ పక్షోత్సవాలను విజయవంతం చేయాలని వైద్యురాలు స్నేహప్రత్యూష తెలిపారు. జాతీయ కుష్టునివారణ పక్షోత్సవాలను గురువారం నగరిగుట్టలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ సుబ్బారెడ్డి, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వాలంటీర్లు, సూపర్‌వైజర్లు ఇంటింటికి వెళ్లి కుష్టువ్యాధి అనుమానితులను గుర్తించి వారికి ప్రభుత్వం ద్వారా మందులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ మీ కుటుంబానికి భద్రత..



ర్యాలీలో పాల్గొన్న మెజిస్ట్రేట్ లావణ్య

కమలాపురం : హెల్మెట్ కేవలం రక్షణ కవచమే కాదని, ఆ కుటుంబానికి భద్రత అని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లావణ్య తెలిపారు. గురువారం మండల లీగల్ సర్వీస్ కమిటీ, స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆధ్వర్యంలో హెల్మెట్ గురించి అవగాహన కల్పిస్తూ నిర్వహించిన ర్యాలీకి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు వాహనాలు నడిపే సమయంలో తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఇటీవల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది తలకు గాయాలై మృతి చెందారని గుర్తు చేశారు. గతంలో ద్విచక్ర వాహనాల ప్రదామాలు జరిగితే కేవలం గాయాలు అయ్యేవని, ఇటీవల జరిగే ప్రమాదాల్లో చాలా మంది మృతి చెందుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి తల్లి, తండ్రి తమ పిల్లలు ప్రయాణం చేసే సమయంలో హెల్మెట్ ధరించే విధంగా సలహా ఇవ్వాలన్నారు. అలాగే న్యాయవాదులు, పోలీసులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా హెల్మెట్ గురించి ప్రజల్లో అవగాహన పెంచడమే కాకుండా, ప్రమాదాల సంఖ్య తగ్గించేందుకు తమ వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న స్నేహప్రత్యూష

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రభుత్వ మంజూశా డిగ్రీ కళాశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహప్రత్యూష తెలిపారు. గురువారం ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు అధ్యక్షతన ఎన్ఎస్ఎస్-1, 2 ఆధ్వర్యంలో మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం, పరిశుభ్రత చాలా అవసరమని, ఇవి అంటువ్యాధులు వ్యాప్తిని నివారిస్తాయన్నారు. మలేరియా, డెంగ్యూ భారిన పడిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే వ్యాధి సోకకుండా జాగ్రత్త వహిండం మేలని, ఎక్కువగా దోమకాటు ద్వారా ఈ వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధీర, ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 పీఓ శ్రీనిత, విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 పీఓ శ్రీనివాసులురెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ ప్రాంతంలో విక్రయించుకోవాలి



మార్కెట్ ప్రాంతంలో విక్రయించుకోవాలని సూచిస్తున్న అధికారులు

జమ్మలమడుగు రూరల్ : సంజామలమోటులో వ్యాపారస్తులు కూరగాయాలను తోపుడుబండ్లపై విక్రయించడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని వ్యాపారస్తులు ఇకపై తమకు కేటాయించిన మార్కెట్ స్థలాల్లో విక్రయించుకోవాలని మున్సిపల్ అధికారులు సూచించారు. గురువారం వారు పట్టణంలో తిరిగి వ్యాపారస్తులకు పలు సూచనలు చేశారు. గత కొంత కాలం నుంచి సంజామల మోటులో కూరగాయాల వ్యాపారస్తుల కొరకు స్థలాలు కేటాయించామని అయితే ఎవరు కూడా మార్కెట్‌లోకి వెళ్లలేదు. రోడ్లపైనే విక్రయిస్తు ఉండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతుండటంతో అధికారులు చర్యలు చేపట్టారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



పులివెందుల గ్రామోత్సవంలో మస్తాను పీరు ఉత్సవం



ఆకట్టుకున్న విచిత్ర వేషధారణలు

పులివెందుల టౌన్ : పట్టణంలో మస్తాన్‌స్వామి పీరు ఉత్సవం అంకాలమ్మ గుడి ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్ ఆధ్వర్యంలో మొదటిరోజు వైభవంగా నిర్వహించారు. గురువారం జెండామాను వీధిలోని పీర్ల చావిడిలో మస్తాన్‌స్వామి పీర్లను కొలువు తీర్చి ముస్తాబు చేశారు. అనంతరం పీర్లను అగ్ని గుండ ప్రవేశం చేసి గ్రామోత్సవం నిర్వహించారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని పలు గ్రామాలలో గురువారం మొహర్రం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.పెద్దపుత్త, తప్పెట్ల తదితర గ్రామాలలో ఉదయం పీర్ల గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ రకాల విన్యాసాలతో, కర్రసాములతో, నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం పీర్లు ఏటికి తరలి వెళ్లాయి.

వేంపల్లెలో..

వేంపల్లె : చింతలమడుగుపల్లెలో వెలసిన ఇమామ్‌ఖాసీం స్వామి పీర్ల పండుగను వైభవంగా నిర్వహించారు. 18వ తేదీ స్వామి వారి ఊరేగింపు జల్దీతో మేలవాయిద్యాలతో ముగిసిందన్నారు. భారీ ఎత్తున అగ్నిగుండం వేసి అందులో ప్రజలు నడిచి తమ మొక్కులు తీర్చుకున్నారు.

వేములలో

వేముల : వేములలో మొహర్రం వేడుకలు మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకున్నారు. వివిధ వేషాలు భక్తులను ఆకట్టుకున్నాయి. చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు పీర్ల పండుగకు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

లింగాలలో..

లింగాల : మండల కేంద్రంలో చిన్నమస్తాన్ స్వామి, పెద్దమస్తాన్ స్వామి, మౌలాలి స్వామీ పీర్లను ఊరేగింపు నిర్వహించారు. దిగువలింగాల, ఎగువలింగాల గ్రామాల్లో శుక్రవారం ఉదయం వరకు ఊరేగింపు కొనసాగుతుంది.



వల్లూరు : పీర్ల గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు



వేముల గ్రామోత్సవంలో మస్తాన్ పీరు



లింగాలలో పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్న ప్రజలు